


# క్షణభంగురం

**సంతోషం..దుఃఖం..ఆనందం..విషాదం..ఇవన్నీ క్షణ భంగురాలేనా?**

**క్షణం క్రితం ఆనందతీరాలని తాకిన ఆమె వెర్రిమనసు, అంతలోనే విషాద అగాధంలో కూరుకుపోయింది.**

గీతాకారుడు చెప్పినట్టు-

ఆనందాన్నీ, విషాదాన్నీ నిరాసక్తతో స్వీకరించమన్నట్టు చెయ్యగలిగితే-

మనిషి మనిషి కాడేమో!

మనసు మనసు కాదేమో!

పది నిమిషాల క్రితం భర్తనుండీ ఫోన్ అందుకుంది ఆమె. అతనికి జోనల్ మేనేజర్-సేల్స్‌గా ప్రమోషన్ వచ్చిందనే వార్త.

ఆమె ఆనందానికి అవధులు లేవు.

ఆమెకి ఏ కొంచెం సంతోషం కలిగినా-

పిన్నిగారూ! అని పిలిచి మరీ తన సంతోషాన్ని నాతో పంచుకుంటుంది పిచ్చిపిల్ల.

ఆమె భర్తకి ప్రమోషన్ వచ్చిందని చెప్పగానే, ఆమె సంతోషాన్ని చూసి నాకూ చాలా సంతోషం అనిపించింది.

మనసులోని మాటల్ని మనస్ఫూర్తిగా ఇలా చెప్పుకుంది.

“పాపం పగలనకా, రాత్రనకా కంపెనీకోసం చాలా కష్టపడతారు పిన్నిగారూ, ఆయన. వాళ్ళ ఎం.డి కి కూడా ఈయనంటే చాలా ఇష్టంట. ఈయన కంపెనీలో చేరిన తర్వాత బిజినెస్ పదింతలు పెరిగిందట” అంటూ గల గలా మాట్లాడేస్తోంది సుందరి.

“అన్నట్టు ఈ శుభవార్తని మా అమ్మావాళ్ళతోనూ, మా అత్తగారితోనూ కూడా పంచుకుంటాను పిన్నిగారూ!” అంటూ తూనీగలాగా లోపలికి పరిగెత్తింది.

సుందరినీ, ఆమె భర్త సుధాకర్నీ చూస్తుంటే చాలా ముచ్చటేస్తుంది. ప్రేమ వివాహం అవటంతో వివాహం అయి పదిహేనేళ్ళయినా, వాళ్ళిద్దరూ చాలా అన్యోన్యంగా ఉంటారు. చూసేవాళ్ళకి ఈర్ష్య కలిగించేటట్టు.

వాళ్ళబ్బాయి పదోక్లాస్‌లోకి వచ్చినా, చెట్టాపట్టాలేసుకొని వీళ్ళిద్దరూ బాగా క్లోజ్‌గా తిరగటం, కొన్ని సందర్భాలలో కొంత ఎబ్బెట్టుగా కూడా అనిపిస్తుంది.

సుందరి లోపలికెళ్ళటంతో, నేనూ ఇంట్లోకెడుతూ వాళ్ళ వరండాలోకి తొంగిచూశాను.

వాళ్ళబ్బాయి సుధీర్ దీక్షగా, ఇంతవరకూ మేము మాట్లాడుకున్న మాటలేమీ తనకి పట్టనట్టు చదువుకుంటున్నాడు. ముచ్చటగా వాడ్ని ఇంకోసారి చూసి ఇంట్లోకి నడిచాను.

దాదాపు పన్నెండేళ్ళుగా మేమిద్దరం పక్క పక్క ఇళ్ళల్లో ఉంటున్నాం. ముందు మేము ఇల్లు కొనుక్కొని ఇక్కడికొచ్చిన నాలుగు నెలలకి, సుందరీ వాళ్ళు కూడా మా పక్క ఇల్లు కొనుక్కున్నారు.

ఆమెకంటే దాదాపు పదేళ్ళ పెద్దదాన్ని అవటంతో నన్ను ‘పిన్నిగారూ’ అని పిలుస్తుంది తను.

వంటింట్లోకెళ్ళి బియ్యం కడిగి ఎలక్ట్రిక్ కుక్కర్లో పడేశాను. కాసేపట్లో పిల్లలొచ్చేస్తారు. వచ్చిన దగ్గర్నించీ ఆకలో అని కాళ్ళకింద ఎసర్లు పోస్తారు.

చక చకా మిగతా పనులు చూసుకుంటూ ఉండగా-

“పిన్నిగారూ! నా కొంప మునిగిందండీ” అంటూ వల వలా ఏడుస్తూ పిలుస్తోంది సుందరి.

కంగారుగా గేటు తీసుకొని వాళ్ళింట్లోకెళ్ళాను.

తల్లిని గట్టిగా పట్టుకున్నాడు సుందరీ వాళ్ళబ్బాయి.

“ఆయనకి యాక్సిడెంట్ అయిందట పిన్నిగారూ! స్పాట్‌లోనే పోయారట. శవాన్ని గాంధీ హాస్పిటల్‌కి తరలిస్తున్నాం, వచ్చి ఫార్మాలిటీస్ పూర్తిచేసుకొని డెడ్‌బాడీ తీస్కెళ్ళమని ఆయన సెల్ నుండీ పోలీసులు ఫోన్ చేశారు పిన్నిగారూ!”

అంటూ హిస్టీరియక్‌గా ఏడుస్తోంది సుందరి.


కన్నీరు మున్నీరుగా ఏడుస్తున్న ఆమెని కంట్రోల్ చెయ్యటం, ఓదార్చటం నా వల్ల కావటం లేదు.

వెంటనే మావారికి ఫోన్ చేసి, విషయం చెప్పి, ఆయన్ని గాంధీ హాస్పిటల్‌కెళ్ళి అన్ని ఫార్మాలిటీస్ పూర్తిచేసి బోడీని తీసుకురమ్మనమని చెప్పాను.

మా పెద్దాడికి ఫోన్ చేసి తొందరగా ఇంటికి రమ్మనమని చెప్పాను. ఇంటి దగ్గర ఏర్పాట్లు చూడటానికి.

సుందరి ఇంట్లో ఫోన్‌బుక్ తీసుకొని వరుసగా ఆమె తల్లిదండ్రులకీ, తోబుట్టువులకీ, అత్తమామలకీ విషయం చెప్పి వెంటనే బయల్దేరి రమ్మన్నాను.

సుందరి ఏదేదో మాట్లాడుతోంది.



"ఎలా పిన్నిగారూ! ఆయన లేకుండా ఎలా బ్రత కను. ప్రొద్దుటే నవ్వుతూ నిద్రలేపే ఆయన ముఖం, కాఫీ కలిపి చేతికందించే ఆయన చేతులూ, తలనొప్పి వస్తే అన్నం కలిపి నోటికందించే ఆయన ప్రేమ, ధైర్యంగా పదిమం దికి సాటిగా ఉండే ఆయన ధైర్యం, ఇక ఈ ఇంట్లో కదలాడదు. స్మశానంలాంటి ఆయనలేని ఈ ఇంట్లో ఎలా ఉండను పిన్ని గారూ!" అంటూ బేలగా అంటోంది సుందరి.

గంటక్రితం ఆమె సంతోషాన్ని పంచుకున్న నేను, ఇప్పుడు, ఇంతలోనే ఆమె పుట్టెడు దుఃఖాన్ని పంచుకోలేకపోతున్నాను.

మా పెద్దబ్బాయ్ వచ్చాడు.

వాడి వెనకాలే రిక్షాలో షామియానా, కుర్చీలు వచ్చాయి.

వాకిలి ముందు షామియానా కట్టారు. కుర్చీలు వేశారు.

తెలిసిన ఒక్కరొక్కరే వస్తున్నారు. వార్త అందిన వాళ్ళ బంధుమిత్రులు తరలి వస్తున్నారు. అందరూ అతన్నీ, వాళ్ళ దాంపత్యాన్ని వేయి నోళ్ళ పొగుడుతున్నారు.

గాంధీ హాస్పిటల్ దరిదాపుల్లో ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కున్నానని ఈయన ఫోన్ చేశారు.

సుందరి దగ్గర బంధువులెవరో వచ్చినట్టు న్నారు.

తలబాదుకుంటూ ఏడుస్తోంది పిచ్చిపిల్ల.

ఎంత చలాకీగా నవ్వుతూ, నవ్విస్తూ తిరిగే పిల్లది. చిన్న వయసులోనే ఇంతటి కష్టం వచ్చింది అని మనసులో అనుకుంటుంటే కన్నీళ్ళు టపటపా రాలి కిందపడ్డాయి.

ప్రతి మనిషి జీవితంలో పుట్టాక ఎంతటి సంబరమో, చావు అంతటి విషాదం.

చావు పుట్టుకలు దైవాధీనాలని ఎంతటి మెట్ట వేదాంతం వల్లించినా, ప్రతి చావూ దగ్గరి బంధువుల గుండెల్లో చిచ్చులు రేపుతుంది. పోయిన మరుక్షణం జీవం నశిస్తుంది. జీవకళ నశిస్తుంది. ప్రాణం ఎక్కడికి పోతుందో?

పోయిన శరీరాన్ని క్రిమికీటకాలు కొద్దిసేపట్లోనే ముట్టడిస్తాయి. శరీరం దుర్వాసనా భరితమవుతుంది.

ఏమిటి ఈ జీవన్మరణాల జగన్నాటకం.

వీధిలో అంబులెన్స్ మోత వినిపించటంతో అందరూ ఎలర్ట్ అయ్యారు. సుందరీ, ఆమె బంధువుల ఏడుపులు తారాస్థాయికి చేరుకున్నాయి. అనుకున్నట్టుగా ఆ అంబులెన్స్ వీళ్ళ వాకిలి ముందు ఆగకుండా ముందుకి వెళ్ళటంతో తాత్కాలికంగా ‘అమ్మయ్యా!’ అనుకున్నాం.

వీధి చివర నుండీ సుందరీ వాళ్ళాయన బైక్‌మోతలాగా, బైక్ మ్యూజిక్ వినిపించింది. ఆ మోత తెలిసిన అన్నిచూపులూ వీధిలోకి ఆశగా చూశాయి.. పోయిన మనిషి తిరిగిరాడనే సత్యం తెలిసి కూడా.

పోయిన మనిషే తిరిగొచ్చాడు. నూరేళ్ళ నూతన జీవితాన్ని నిండుగా నింపుకున్న మగాడిలాగా తిరిగొచ్చాడు.

అతన్ని చూసి అందరూ ఒక్క అడుగు వెనక్కేశారు. దయ్యమా! లేక భూతమా అన్నట్టు...

“ఏమిటి పిన్నిగారూ! ఈ హడావిడి? ఏమిటి ఈ షామియానాలూ, కుర్చీలు...? మా చిన్నిగాడి పెళ్ళి కుదిర్చారా ఏమిటి?” అంటూ గలగలా మాట్లాడుతున్నాడు.

సుందరి ఒక్క అంగలో భర్తని చేరింది.

ఇంటి ముందు చేరిన అందరూ..ఇబ్బందిగా, ఏమీ అర్థంకానట్టుగా, ఏం చెయ్యాలో తెలీనట్టుగా..తలగోక్కుంటున్నారు.

సుందరి భర్త చెపుతున్నాడు.

“ఇంటికొస్తూ ఏదో బిజినెస్ కాల్ ఎటెండ్ అవుతుంటే, మోటర్‌బైక్ మీద ఒక దొంగ వెధవ తన సెల్‌కాస్తా ఎగరకొట్టుకుపోయాడని.”

అతను ఇంకా ఏదో చెపుతూనే ఉన్నాడు. మిగతా కథ మా అందరికీ అర్థమయిపోయింది.

ఆ దొంగకి యాక్సిడెంట్ అవటం, ఈయన సెల్ నుండీ పోలీసులు ఇంటి నెంబర్‌కి డయల్ నెంబర్స్ నుండీ గుర్తించి ఫోన్ చెయ్యటం...


ఎక్కడివాళ్ళం అక్కడ సర్దుకున్నాం.

మా వారికి ఫోన్ చేసి “గాంధీ హాస్పిటల్‌కి వెళ్ళింది చాల్లేకానీ, వెనక్కి తిరిగి రమ్మనమని” కథ బ్రీఫ్‌గా చెప్పేశాను.

మా పెద్దబ్బాయ్ టెంట్ హౌస్ వాళ్ళకి చెప్పి గుట్టుచప్పుడు కాకుండా వాళ్ళవీధిలో కుర్చీలూ, షామియానా తీయించి వీధి ఖాళీ చేశాడు.

సంతోషం, దుఃఖం, ఆనందం, విషాదం ఇవన్నీ క్షణభంగురాలే కదా మరి.

○



## పెళ్లికి గ్రీన్‌సిగ్నల్?

కొంతకాలంగా కరీనాకపూర్-సైఫ్ అలీఖాన్‌ల ప్రేమాయణం గురించి అందరికీ తెలిసిందే! త్వరలోనే తమ పెళ్లి జరుగుతుందని ఇద్దరూ బహిరంగంగా చెప్పుకుంటూ వస్తున్నారు. సైఫ్ తల్లి షర్మిలా టాగూర్ కూడా కరీనాని తన కోడలిగా స్వీకరించడానికి సుముఖత వ్యక్తం చేసింది. కానీ ఇంతవరకూ కరీనా పేరెంట్స్ నుంచి ఎలాంటి రెస్పాన్సూ రాలేదు. అయితే కరీనా పెళ్లి విషయమై ఇటీవల రణధీర్ వ్యాఖ్యానించాడు. తన కూతురు మనసుపడిన వ్యక్తిని పెళ్లిచేసుకునేందుకు తమకి ఎలాంటి అభ్యంతరాలుండవని, ఆమె సంతోషమే తమ సంతోషమని రణధీర్ చెప్పడంతో కరీనా-సైఫ్‌ల పెళ్లి తొందర్లోనే జరుగుతుందని అంతా అనుకుంటున్నారు.